క్లుప్తంగా

శ్రీవిద్యా సర్వమంగళ దేవి పీఠంలో పూజలు



పూజల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర దంపతులు

పార్వతీపురం టౌన్: శ్రీవిద్యా సర్వమంగళ దేవి పీఠంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గాష్టమి మహా పర్వదినం సందర్భంగా అమ్మవారి పూజల్లో రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర దంపతులు గురువారం పాల్గొన్నారు. మురపాక కాళిదాసు యాజీ ఆధ్వర్యంలో అమ్మవారి హోమం, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం గోశాలలో ప్రత్యేక పూజలు జరిపారు.

లక్ష్మీనృసింహస్వామికి ముడుపుల పూజలు



పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండలంలోని సువర్ణముఖీ నది ఒడ్డున ఉన్న వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన లక్ష్మీనృసింహస్వామికి భక్తులచే గురువారం ముడుపుల పూజలు జరిగాయి. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడం వలన ఉపవాసాలతో భక్తులు నిష్ఠతో పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ ముడుపుల పూజలు, అభిషేకాలు చేశారు.

ఐటీ రంగంలో మంచి భవిష్యత్



బలిజిపేట ఉన్నత పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థు

బలిజిపేట: పదవ తరగతి విద్యార్థులకు పీఎం శ్రీ పాఠశాలలో వృత్తి విద్యా కోర్సులలో ఇస్తున్న శిక్షణ వారికి ఎంతో ఉపయోగపడుతుందని, రానున్న రోజుల్లో ఐటీ రంగంలో మంచి భవిష్యత్ ఉంటుందని బలిజిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు తెలిపారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యా కోర్సులు (ఒకేషనల్) ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఐటీ అండ్ ఐటీ ఎస్ ట్రేడ్‌కు చెందిన విద్యార్థులు దీనిలో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో వృత్తి విద్య ఉపాధ్యాయుడు సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు ఉచిత వైద్యం



ఆరోగ్యశ్రీ సేవలపై ఆరా తీస్తున్న పున్నాన దేవి

పార్వతీపురం టౌన్: రోగులకు ఉచిత వైద్యం అందించడమే ఆరోగ్యశ్రీ లక్ష్యమని ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ పున్నాన దేవి అన్నారు. పట్టణంలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులైన సింహాద్రి, స్వామి ఆస్పత్రులను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ రోగులకు ఉచిత, నాణ్యమైన వైద్యాన్ని అందేలా చూడాలని ఆరోగ్య మిత్రలకు సూచించారు. ఆరోగ్యశ్రీ వార్డుకు వెళ్లి ఉచిత వైద్యం అందుతుందా.. లేదా... అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే ఫిర్యాదు చేయాలని సూచించారు.

శ్రీ సూర్యపీఠంలో చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న వేమకోటి నరహరిశాస్త్రి

పార్వతీపురం టౌన్: శ్రీ సూర్యపీఠంలో మహాష్టమి సందర్భంగా గురువారం చండీ హోమం నిర్వహించారు. ఆదిత్య పంచాయతన క్షీరాభిషేకం, సౌర అరుణ పారాయణాలు, నవదుర్గా పూజ నిర్వహించారు. విశ్వశాంతి మంత్ర హోమం లోక కళ్యాణార్థం, సకాల వర్ష ప్రాప్తికి ప్రజల ఆరోగ్య సిద్ధికి చండీ హోమం నిర్వహించామని వేమకోటి నరహరి శాస్త్రి తెలిపారు. యాగ పూర్ణాహుతి అనంతరం నారాయణ సేవ చేశారు. కార్యక్రమంలో వేమకోటి వివేకానంద్, టీఆర్ కృష్ణశర్మ తదితరుల వైదిక సహకారం అందించారు.

ఆ రహదారి శిథిలం

- ప్రయాణం నరకం
- పార్వతీపురం – కూనేరు, పార్వతీపురం వీరఘట్టం రోడ్డు అధ్వానం
- మరమ్మతులు చేపట్టని అధికారులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఎన్నికల హామీలు గాలికొదిలేసిన కూటమి నేతలు



పార్వతీపురం మండలం అడ్డాపుశీల గ్రామం వద్ద గోతులతో పార్వతీపురం - వీరఘట్టాం రహదారి

పార్వతీపురం టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు నెలల్లో రోడ్లపై గోతులు పూడుస్తాం.. పార్వతీపురం నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడతాం... అంటూ ఎన్నికల ముందు జరిగిన బహిరంగ సభలో నారా లోకేష్ ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా చిన్న గొయ్యి కూడా పూడ్చక పోవడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఎన్నికల హామీలు ఏమయ్యాయంటూ లోకేష్‌బాబును స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి. నిత్యం ఎంతోమంది వాహనదారులు రాకపోకలు సాగించే పార్వతీపురం – కూనేరు అంతర్రాష్ట్ర రహదారి, పార్వతీపురం – వీరఘట్టాం రహదారి నరకానికి చిరునామాగా గుంతలమయంగా మారిపోయాయి. పెద్దపెద్ద గుంతలతో ఉన్న ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు నరకం చూస్తున్నారు. వర్షం వస్తే రోడ్డుపై ఏర్పడిన గుంతల్లోకి నీరు చేరుతోంది. దీంతో కొత్తవారికి ఈ గోతుల గురించి తెలియకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.

నిత్యం రద్దీ

పార్వతీపురం – కూనేరు అంతర్రాష్ట్ర రహదారిలో నిత్యం వందల సంఖ్యలో బస్సులు, లారీలు, ఆటోలు, కార్లు, బైక్‌లతో పాటు ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. అత్యవసర వైద్యం కోసం అంబులెన్సులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి వచ్చేందుకు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. రహదారి అధ్వానంగా ఉండడంతో సమయానికి అంబులెన్స్ గమ్యానికి చేరుకోలేక రోగుల ప్రాణాల మీదకు వస్తోంది. కొన్ని సందర్భాల్లో భారీ వాహనాలు గుంతల్లో ఇరుక్కుపోయి 8 నుండి 10 గంటల వరకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

అధికారులకు కానరాని గుంతలు

కార్లలో ఈ రోడ్డుపై ప్రయాణించే ప్రజాప్రతినిధులు, అధికారులకు మాత్రం గుంతలు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో ఎంతో అభివృద్ధి చేశామంటూ సంబరాలు చేసుకోవడం తప్ప, రహదారులు కనీస మరమ్మతులను కూడా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తాత్కాలిక మరమ్మతులూ చేపట్టరా?

రోడ్లు గుంతలు పడిన చోట తాత్కాలికంగా తారు, రాళ్లు వేసి మరమ్మతులు చేయాలనే విషయాన్ని అధికారులు మరిచిపోయారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ రోడ్ల నిర్మాణాలపై అధికారులతో జిల్లా స్థాయిలో ప్రజాప్రతినిధులు సమీక్షలు నిర్వహించి మరమ్మతులు చేపడతామని ప్రకటనలకే పరిమితం అవడంతో వాహనదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అధ్వానంగా తయారైన రహదారి మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు, స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.



పార్వతీపురం పట్టణ శివారులో అధ్వానంగా పార్వతీపురం - కూనేరు రహదారి

భయం వేస్తోంది..

పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లాలంటే భయంగా ఉంది. పార్వతీపురం పట్టణ శివారుల నుంచే పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షం పడితే గోతులు నీటితో నిండిపోయి వాహనాలు నడపాలంటే భయం వేస్తోంది. రాయగడ వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి కావడంతో భారీ వాహనాలు గుంతల్లో ఇరుక్కొని సుమారు 10గంటల ట్రాఫిక్‌జామ్ ఏర్పడే పరిస్థితి నెలకొంది. అధికారులు మరమ్మతులు చేపట్టాలి.

– ముప్పల సత్యంనాయుడు, వాహన చోదకుడు, పార్వతీపురం

మరమ్మతులు చేపట్టండి

పార్వతీపురం వీరఘట్టం వెళ్లే రహదారిలో పెద్ద పెద్ద గుంతలు చెరువును తలపిస్తున్నాయి. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాలు కురిస్తే వాహనంపై వెళ్లాలంటే ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని వెళ్తున్నాం. రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఎన్నిసార్లు విన్నవించుకున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

– గులిపల్లి మాధవ, వాహన చోదకుడు, వైకేఎం కాలనీ, పార్వతీపురం

గిరిజన రైతులకు పట్టాలివ్వాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు

సాలూరు: అర్హులైన గిరిజన రైతులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సీదరపు అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం గిరిజనులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో సర్వేలు పూర్తి చేసినప్పటికి పలువురు రైతులకు పట్టాల మంజూరు చేయలేదన్నారు. గంజాయిభద్ర పంచాయతీలోని గ్రామాల్లో పూర్తి స్థాయిలో సర్వేలు చేయలేదని ఫలితంగా గిరిజన రైతులకు పోడు పట్టాలు లేవని తెలిపారు. దీని వలన సదరు రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు, నష్టపరిహారాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లేడువలస, బొర్రపనికివలస గ్రామాల గిరిజనులకు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ వెంకటరమణ కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు గెమ్మెల జానకిరావు, సుందరరావు, జిత్తు, పూలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ప్రత్యేక పూజలు

పార్వతీపురంటౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమి మహా పర్వదినం సందర్భంగా శ్రీవిద్యాసర్వమంగళ దేవి పీఠంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ దంపతులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. మురపాక కాళిదాసు యాజీ ఆధ్వర్యంలో దుర్గ చెట్టువద్ద పూజలు చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



అమ్మవారికి హారతి ఇస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దంపతులు

మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

సీతానగరం: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో ఉన్న మద్యం షాపులు నిర్వహణ కోసం అర్జీదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ శుక్రవారం సాయంత్రం 7 గంటల వరకూ గడువు పెంచుతూ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందని సీఐ డి.పద్మావతి అన్నారు. ఈ మేరకు ఆమె గురువారం మాట్లాడుతూ ఇప్పటికి 173 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. అందులో సీతానగరం 45, గరుగుబిల్లి 75, బలిజిపేట 53 దరఖాస్తులు చొప్పున ఈ నెల 9నాటికి వచ్చాయన్నారు. మద్యం షాపులు నిర్వహించడానికి ఆసక్తి కలిగిన వారు ఇంకా ఎవరైనా శుక్రవారం సాయంత్రం 7 గంటలలోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 14న ఉన్నతాధికారుల పర్యవేక్షణలో డ్రా తీయనున్నామని, 16వ తేదీ నుంచి మద్యం షాపులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

పార్వతీపురం టౌన్: మండలంలోని అడ్డాపుశీల గ్రామంలో నవంబర్ 1 నుంచి మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్ఆర్ఐ మోహన్ సుదీర్ పట్టా తెలిపారు. టైలరింగ్‌లో నైపుణ్యత కలిగిన వారి ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలకు శిక్షణ అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే ఆరు బ్యాచ్‌లకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణ అనంతరం పేదవారికి ఉచితంగా కుట్టు మిషన్లు కూడా అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 97040 15756 నంబరును సంప్రదించాలన్నారు.

పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలి

- జెడ్పీ సీఈఓ సత్యనారాయణ



బలిజిపేట: సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవికుమార్

సీతానగరం: గ్రామాల్లో సామాజికపరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని, తద్వారా పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని జెడ్పీ సీఈఓ సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రెండో విడత గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు జరుగుతున్న శిక్షణ తరగతుల్లో ఆయన గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. ప్రజలకు తాగునీరు, అత్యవసర వైద్య సేవలు అందించాలని సూచించారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులతో నిర్దేశించిన సమయంలో సమావేశాలు నిర్వహించి ప్రజల సమస్యలపై చర్చించుకోవాలని సూచించారు. గ్రామాల్లో చెత్త శుద్ధి కేంద్రాల ద్వారా పంచాయతీల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టిపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమరావు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

బలిజిపేట: పంచాయతీల అభివృద్ధికి అంతా పాటుపడాలని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌ల ముగింపు శిక్షణ కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యులు కీలక భూమికను పోషించాలన్నారు.

ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకుని పంచాయతీ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నిధుల ఖర్చు విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాల్సి ఉందన్నారు. పంచాయతీ అభివృద్ధి పనుల నిర్వహణపై రిసోర్సుపర్సన్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



సీతానగరం: మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

ధాన్యం కొనుగోలులో మెలకువలు పాటించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఓ అవినాష్

సీతానగరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే సమయంలో మెలకువలు పాటించాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. మండల వ్యవసాయ కార్యాలయంలో గురువారం డిజిటల్ పవర్ సరఫరాలు వ్యవసాయ సహాయకులకు ధాన్యం సేకరణ విషయంలో అవలంబించాల్సిన మెలకువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఉత్పత్తి చేసిన ధాన్యాన్ని రైతు సేవ కేంద్రాల ఆధ్వర్యంలో ప్రభుత్వం సేకరణ చేస్తుందన్నారు. సేకరణ సమయంలో ధాన్యం రకం, నాణ్యత అంశాలపై అవగాహన కల్పించుకోవాలని కోరారు. పౌర సరఫరాల శాఖ అధికారులు వాహనాలు రైతులకు సమకూర్చడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సహాయకులు, సచివాలయాల డిజిటల్ సహాయకులు, పౌర సరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై సాంకేతిక శిక్షణా సదస్సు



సూచనలు ఇస్తున్న టీఏ దుర్గ

బలిజిపేట: ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి సాంకేతిక శిక్షణా కార్యక్రమాన్ని గురువారం బలిజిపేట ఆర్బీకేలో నిర్వహించారు. టెక్నికల్ అసిస్టెంట్ దుర్గ గ్రామ వ్యవసాయ సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, టెక్నికల్ అసిస్టెంట్‌లకు శిక్షణ ఇచ్చారు. ధాన్యం కొనుగోలులో ముఖ్యంగా తేమ 17శాతం, సేంద్రీయ వ్యర్థ పదార్థాలు 1శాతం, దెబ్బతిన్న, రంగుమారిన, మొలకెత్తిన, పురుగు పట్టిన ధాన్యం 5శాతం, పరిపక్వం, కుచించుకుపోయి, మెలి తిరిగిన ధాన్యం 3శాతం, తక్కువ శ్రేణి, కేలీలు 6శాతం మించకుండా చూడాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు అవసరమని సూచించారు. సాధారణ రకం క్వింటా రూ.2,300, ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.2,320లుగా నిర్ధారించడం జరిగిందన్నారు. కేంద్రాలలో ఉన్న వీఏఏలు రైతులకు షెడ్యూలు ఇచ్చి ఆ ప్రకారం కొనుగోలు చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు, పి.విద్యుష, వీఏఏలు పాల్గొన్నారు.

విధిగా నేత్ర పరీక్షలు చేయించుకోవాలి

- జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్‌బాబు



మాట్లాడుతున్న జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్‌బాబు

పార్వతీపురం టౌన్: ప్రతీ ఒక్కరూ విధిగా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్‌బాబు అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నేత్ర వైద్య విభాగంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి దోషం వున్న వారికి కళ్లద్దాలు కోసం, కేటరాక్ట్, టెరిజియం, గ్లోకోమా వున్న వారిని గుర్తించి మెరుగైన చికిత్సలు, శస్త్ర చికిత్సల కోసం సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రులకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఉచిత రవాణా, భోజనం, మందులు, కళ్లజోళ్లు సౌకర్యాలు కల్పించి వారికి దృష్టి దోష నివారణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నేత్ర వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్‌రెడ్డి, ఆస్పత్రి ఆర్ఎంఓ, నేత్ర వైద్య నిపుణులు డా.శ్యామల, శస్త్ర చికిత్స నిపుణులు డా.వెంకటేష్, జిల్లా ఎన్‌జీఓ అధ్యక్షుడు కిషోర్, నేత్ర వైద్య సహాయకులు రమేష్, స్వాతి, నర్సింగ్ శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గాదేవి అవతారంలో దుర్గమ్మ



పార్వతీపురం టౌన్: దుర్గాదేవి అవతారంలో కొత్తవలస దుర్గమ్మ



పార్వతీపురం టౌన్: వేమకోటివారి వీధిలో శ్రీదుర్గాదేవి అవతారంలో అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష దీపారాధన చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బలిజిపేట: అజ్జాడలో లక్ష దీపారాధన



మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న కామాక్షమ్మ తల్లి

13 మద్యం దుకాణాలకు 280 దరఖాస్తులు

సాలూరు: సాలూరు పరిధిలో మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 280 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.దాసు గురువారం తెలిపారు. సాలూరు మున్సిపాలిటీలో 5 షాపులకు 59 దరఖాస్తులు, మండలంలో రెండు షాపులకు 39, పాచిపెంట మండలంలో 3 షాపులకు 74, మక్కువ మండలంలో 3 షాపులకు 108 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. శుక్రవారం వరకు దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచినట్టు తెలిపారు.